సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 6 । నవంబర్ । 2024



పుట్టలో పాలు పోసి.. మొక్కులు చెల్లించి..

పెద్దపల్లిరూరల్: నాగుల చవితి సందర్భంగా మహిళా భక్తులు మంగళవారం పుట్టలో పాలు పోసి, పూలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని వివిధ శివాలయాల ఆవరణల్లోని పుట్టల వద్ద పసుపు, కుంకుమ, పూలు చల్లి పూజలు చేశారు. పండ్లు, ఫలాలు ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని నాగదేవతను వేడుకున్నారు.

న్యూస్‌రీల్

సర్వేకు సహకరించండి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): జిల్లాలో చేపట్టే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కోరారు. ఎన్టీపీసీ ఉద్యోగ వికాస కేంద్రంలో మంగళవారం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఇంటింటి సర్వేపై శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ కుమారస్వామి, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాజలింగుతో కలిసి ఆమె మాట్లాడారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు తమ పూర్తి సమాచారం అందించి సహకరించాలన్నారు. ఆధార్, ఆహార భద్రత కార్డు, ధరణి తదితర వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ లింగారెడ్డి, ఎంఈవో చంద్రయ్య, ఏసీపీ శ్రీధర్‌ప్రసాద్, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు, డీఏ చెల్లించాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 22లోగా సమస్యలు పరిష్కరించకుంటే 23న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్మాగ్రహదీక్ష నిర్వహిస్తామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి ఆందోళనకారులకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. నాయకులు కనకయ్య, అనిల్, సతీశ్‌కుమార్, గణేశ్, రమేశ్‌బాబు, శ్రీనివాస్, వీరస్వామి, విజేందర్‌రెడ్డి, పుష్పలత, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

'మల్టీపర్పస్ విధానం వద్దు'



నిరసన తెలుపుతున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ఒకరోజు దీక్ష చేపట్టారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 20 తర్వాత నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. నాయకులు రవీందర్, ఖాజా, అశోక్, లచ్చయ్య, గౌసొద్దీన్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజయ్య, సంపత్‌రెడ్డి, నాగేశ్వర్, నాగరాజు, ముస్తఫా, రవి పాల్గొన్నారు.

పత్తి ధర రూ.6,821

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.6,821 ధర పలికింది. కనిష్టంగా రూ.5,921, సరాసరి ధర రూ.6,655గా నిర్ణయించినట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 289 మంది రైతులు తెచ్చిన 1,043 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు.

ప్రవేశాల గడువు పొడిగింపు

గోదావరిఖనిటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో ప్రవేశాల గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజ, అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ జి.సుబ్బారావు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం అపరాధ రుసుం లేకుండా గడువు పొడిగించారన్నారు. ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, 10ప్లస్ 2 ఉత్తీర్ణులైనవారు నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు. వివరాలకు 73829 29655 ఫోన్ నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

మళ్లీ హైదరాబాద్‌కు బాలికలు


ముత్తారం(మంథని): స్థానిక కేజీబీవీలో గత నెల 27న 54 మంది బాలికలు అస్వస్థతకు గురైన విషయం విదితమే. వీరు కోలుకున్నాక ఆస్పత్రుల నుంచి ఇళ్లకు పంపించారు. ఇందులోని ముగ్గురు ఇంటర్ విద్యార్థినులు సునీత, రక్షిత, రేవతి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది గతనెల 30న డిశ్చార్జి అయ్యారు. మళ్లీ కొద్దిగా దగ్గు రావడంతో మంగళవారం పెద్దపల్లి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పిల్లలేం చూస్తున్నారో?



- సెల్‌ఫోన్ మైకంలో విద్యార్థులు, యువత
- తల్లిదండ్రులూ.. నిఘా ఉంచండి
- ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో 71 సైబర్‌క్రైం కేసులు

నేటి పిల్లలు, యువత సెల్‌ఫోన్ మైకంలో ఉంటున్నారు. క్షణం తీరిక లేకుండా తిండి, నిద్ర మానేసి, అందులోనే లీనమవుతున్నారు. ఫోన్, కంప్యూటర్ వాడేవారు ఇంటర్‌నెట్‌లోకి వెళ్లగానే ఏదో ఒక రూపంలో అశ్లీలం పలకరిస్తుంది. పొరపాటున దాన్ని క్లిక్ చేస్తే ఆ తర్వాత అన్నీ అలాంటి దృశ్యాలే పదేపదే వస్తుంటాయి. విద్యార్థులు, ముఖ్యంగా యువత ఇలాంటి సైట్లు చూడటం మొదలుపెడితే అది అలవాటుగా మారి, చివరికి వ్యసనమవుతుంది. గంటల తరబడి సోషల్ మీడియాలో ఉంటున్న పలువురు అనర్థాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 71 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్, కంప్యూటర్‌లో ఏం చూస్తున్నారో నిఘా ఉంచాలి. అవసరం తీరగానే వాటిని తీసుకోవాలి. - 8లో▸



తూకం.. ఆలస్యం

- జిల్లావ్యాప్తంగా నెమ్మదిగానే ధాన్యం సేకరణ
- పూర్తిస్థాయిలో ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- పూచీకత్తుతో మిల్లుల కేటాయింపు ఆలస్యమే కారణం
- కొనుగోళ్లలో జాప్యం, వర్షాలతో అన్నదాతల్లో ఆందోళన



సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. కానీ, ఆ స్థాయిలో సేకరణ కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోళ్లు వేగంగా సాగడంలేదు. జిల్లాలో మొత్తం 324 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటివరకు 316 మాత్రమే ప్రారంభించారు. వానాకాలంలో జిల్లావ్యాప్తంగా సుమారు 2 లక్షల ఎకరాల విస్తీర్ణం వరి పండించారు. అందులో కొనుగోలు కేంద్రాలకు దాదాపు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని పౌర సరఫరాల సంస్థ అంచనా వేసింది. రైతులు కూడా వరి కోతలు ప్రారంభించి వడ్లు ఆరబోస్తున్నారు. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రారంభించిన చోట్ల కాంటా వేయడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు.

ఆలస్యానికి కారణం పూచీకత్తు..

కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు కేటాయించాలి. అయితే, సీఎంఆర్ ఇవ్వని డీఫాల్టర్లకు ధాన్యం కేటాయించేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. వాస్తవానికి వరి కోతలు ప్రారంభానికి ముందే ఈ పాలసీ వెల్లడించాల్సి ఉంది. కోతలు ముమ్మరమై.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే సమయంలో తాజా ప్రకటన కొనుగోళ్ల ఆలస్యం కావడానికి కారణమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 149 బాయిల్డ్ మిల్లులుండగా అందులో డీఫాల్ట్‌చేసినవి పోగా 110 మిల్లులకు, 8 రారైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. వీటిలో మంగళవారం వరకు బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చిన 95 రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించారు. గ్యారెంటీలు ఇవ్వగానే మిగిలిన వాటికి కేటాయిస్తామని, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తామని పౌర సరఫరాల డీఎం శ్రీకాంత్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

జిల్లా సమాచారం

సాగు విస్తీర్ణం(ఎకరాలు)	2,09,542
దిగుబడి అంచనా(మెట్రిక్ టన్నులు)	4,50,000
సేకరణ లక్ష్యం(మెట్రిక్ టన్నులు)	4,06,000
ఇప్పటిరకు కొనుగోలు చేసిన ధాన్యం (మెట్రిక్ టన్నులు)	500
మొత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలు	324
ఇప్పటివరకు ప్రారంభించినవి	316

వారమైనా కాంటా కాలే



నాకున్న రెండెకరాల్లో 1010 రకం వరి సాగు చేసిన. రూ.30వేల దాకా పెట్టుబడి అయ్యింది. వారం క్రితమే కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసిన. ఇంకా కాంటా పెట్టలేదు. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియక ఇక్కడే ఉంటున్న.

– బియ్యాల సత్యనారాయణ, ఓదెల

సన్నవడ్లు జోకుతలేరు



నాకున్న నాలుగెకరాల్లో సన్నవరి ఏసిన. రూ.80వేల వరకు పెట్టుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి ఇరవై రోజులైతంది. సన్నవడ్లని జోకుతలేరు. వడ్లు ఎప్పుడు కొంటారో తెలియని పరిస్థితి ఉంది.

– గాడిచర్ల మొగిలి, ఓదెల

కాలం గడుపుతున్నరు



నాకున్న ఎకరంలో పండించిన వడ్లను పదిహేను రోజుల కింద సెంటర్‌కు తీసుకొచ్చిన. కాంటా పెట్టాలని నిర్వాహకులను అడిగితే రేపుమాపు అంటున్నరు. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియడం లేదు. తొందరగా కొనుగోలు చేయాలె.

– గజ్జెల తిరుపతి, సుగ్లాంపల్లి

'ఎల్‌ఆర్‌ఎస్'లో వేగం పెంచాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులేజైషన్ స్కీం) దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష డీటీసీపీవో శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. ఎల్–2 స్టేజీలోని దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం అలింకో సంస్థ చేపట్టిన దివ్యాంగుల వెకల్యం నిర్ధారణ శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉండొద్దు..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డును ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వర్షాలు కురిసినా ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ ఉన్నారు.

సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

కమాన్‌పూర్(మంథని): ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. పేరపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు.

ఉద్రిక్తత మధ్య ఫంక్షన్‌హాల్ కూల్చివేత

- అడ్డుకున్న బాధిత బీఆర్ఎస్ కార్పొరేటర్, కుటుంబ సభ్యులు



కూల్చివేతను అడ్డుకుంటున్న బాధిత కుటుంబం

కోల్‌సిటీ(రామగుండం): తీవ్ర ఉద్రిక్తతల మధ్య బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ పెంట రాజేశ్‌కు చెందిన సిరి ఫంక్షన్‌హాల్‌లోని కొంతభాగాన్ని బల్దియా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు మంగళవారం కూల్చివేశారు. గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని ఈ ఫంక్షన్ హాల్‌కు అనుమతి లేదని అధికారులు ఇప్పటికే నోటీసులు జారీచేశారు. దీంతో జేసీబీలతో ఫంక్షన్‌హాల్ ప్రహరీతోపాటు ఆవరణలోని కొంత భాగాన్ని నేలమట్టం చేశారు. నాలాను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని కూడా తొలగించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమీప బంధువైన పెంట రాజేశ్.. కూల్చివేతలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు కొంత సమయం ఇవ్వాలని ఆయన కుటుంబ సభ్యులు జేసీబీల ఎదుట బైఠాయించారు. బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అప్పటికే అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఇది కక్షసాధింపే..

బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు ధోరణికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుంటే ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేసి జరిమానా వసూలు చేయాలికానీ ఇలా ఆస్తినష్టాన్ని కలిగించేలా దుర్మార్గపు చర్యలకు పాల్పడటం సరైంది కాదన్నారు. దీనిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అన్ని అనుమతులతో ఫంక్షన్‌హాల్ కొనసాగిస్తున్నా కాంగ్రెస్ పార్టీ నాయకులు కక్షగట్టి అన్యాయంగా కూల్చివేశారని, కొంత సమయం ఇవ్వాలని కోరినా వినలేదని బాధితుడు పెంట రాజేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

హైడ్రాకు సంకేతాలా..?

బల్దియాలో హైడ్రా తరహాలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నట్లు ఫంక్షన్‌హాల్ కూల్చివేత ద్వారా అధికారులు సంకేతాలు ఇచ్చారని తెలుస్తోంది. ఇప్పటికే మరికొన్ని ఫంక్షన్ హాళ్లకు కూడా నోటీసులు జారీ చేయగా, స్టే కోసం యజమానులు కోర్టును ఆశ్రయించారు.

ఫలితమిస్తున్న 'ఆయిల్‌పామ్'

- నాలుగేళ్ల తర్వాత కోతకు..
- రైతు చేతికి తొలి దిగుబడి
- అన్నదాత మోములో ఆనందం
- మద్దతు ధర ప్రకటనపై సర్వత్రా హర్షం
- కాల్వశ్రీరాంపూర్‌లో నూనె తయారీ పరిశ్రమ నిర్మాణం వేగవంతం



కాచాపూర్‌లో కాతకు వచ్చిన ఆయిల్‌పామ్ చెట్లు



తొలిదశలో కాసిన ఆయిల్‌పామ్ గెల

జూలపల్లి(పెద్దపల్లి): సుమారు నాలుగేళ్ల తర్వాత అన్నదాత మోములో ఆనందం వ్యక్తమవుతోంది. ఏళ్లనాటి శ్రమకు ఫలితం దక్కబోతోంది. జిల్లాలోనే తొలిసారి దిగుబడి చేతికి వస్తుండడంతో సంబంధిత శాఖ అధికారులు కూడా సంతోషపడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో తొలివిడత నాటిన ఆయిల్‌పామ్ తోటల్లోంచి కొద్దిరోజులుగా దిగుబడి వస్తోంది.

తొలికాయలు పారబోత..

- హార్టికల్చర్ అధికారుల సూచనలతో తొలిదశలో కాసిన ఆయిల్‌పామ్ కాయలను తెంపుతున్న రైతులు వాటిని వృథాగానే పడవేస్తున్నారు. మొదటిసారి కాసిన కాయల నుంచి ఆశించిన మేరకు ఆయిల్(నూనె) ఉత్పత్తి కాదనే సూచనలతో ఇలా చేస్తున్నామని పలువురు రైతులు చెబుతున్నారు.

ఆదాయంపై ఆసక్తి..

- జిల్లాలోనే తొలిసారి ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు పంట దిగుబడితోపాటు దాని విక్రయాల ద్వారా సమకూరే ఆదాయంపైనా ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారు. ఆశించిన ఆదాయం వస్తే తమకు రెట్టింపు రాబడి ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు.. అధికారులు చెప్పినట్లు మంచి దిగుబడి వస్తే అంతకు మించి ఆనందం ఏముంటుందని అన్నారు. దీనికితోడు ఆయిల్‌పామ్ టన్ను మద్దతు ధర రూ.15 వేల – రూ.18 వేలుగా ప్రభుత్వం ఇటీవల ప్రకంటించడంతో రైతులు సహజంగానే సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమ పనుల్లో వేగం..

- జిల్లావ్యాప్తంగా సేకరించే ఆయిల్‌పామ్ గెలలను శుద్ధి చేసి, నూనె తయరు చేసేందుకు అవసరమైన పరిశ్రమను కాల్వశ్రీరాంపూర్ మండ ం పెద్దరాతుపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది రైతులు సాధించే దిగుబడిని ఈ పరిశ్రమకు తరలించి శుద్ధి చేస్తారు. ఆ తర్వాత నూనె తయారు చేస్తారు. అయితే, పంట దిగుబడి వచ్చేలోగా పరిశ్రమ నిర్మాణం పూర్తిచేయాలనే లక్ష్యంతో పనుల్లో వేగం పెంచారు. తిరుమల ఆయిల్ కెమ్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఈ ఫ్యాక్టరీ నిర్మిస్తోంది.

ఎకరాకు 10 టన్నుల దిగుబడి..

- రాష్ట్రంలోనే తొలిసారి చేపట్టిన ఆయిల్‌పామ్ దిగుబడి స్థాయికి రావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉద్యానవన శాఖ అధికారుల అంచనా ప్రకారం ఎకరాకు 8 టన్నుల – 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంటున్నారు. ఈలెక్కన ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పరిశ్రమ యజమానులు కొనుగోలు చేస్తే.. అన్నదాతకు ఎకరాపై ఏడాదికి సుమారు రూ.1.50 లక్షల – రూ.2లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని ఉద్యాన వన శాఖ అధికారులు వివరిస్తున్నారు.

సాగు విస్తీర్ణం 2,696 ఎకరాలు..

- ఆయిల్‌పామ్ సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. తగిన ప్రోత్సాహకాలు కూడా అందిస్తోంది. దీంతో చాలామంది అన్నదాతలు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించారు. తొలిదశలో జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లోని 1,009 మంది రైతులు 2,696.73 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వచ్చే ఏడాది సాధించే దిగుబడి, ఆదాయాన్ని బట్టి సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందిస్తున్నారు.

రెండెకరాల్లో వేసిన



అధికారుల సూచనతో రెండేళ్ల క్రితం రెండెకరాల్లో ఆయిల్‌పామ్ పంట వేసిన. మరో మూడేళ్లకు కాతకు వస్తుందంటున్నారు. అప్పుడు వచ్చే ఆదాయాన్ని బట్టి మరోమూడెకరాల్లో సాగు చేస్త. ప్రస్తుతం ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా పత్తి పండిస్తున్న.

– కుంట రాజేశ్వర్‌రెడ్డి, కుమ్మరికుంట

ఆదాయం అధికం



ఆయిల్‌పామ్ సాగుకు జిల్లాలోని నేలలు అనుకూలంగా ఉన్నాయి. రైతులు ఈ పంట సాగు చేస్తే అత్యధిక ఆదాయం సాధించే అవకాశం ఉంది. ప్రభుత్వం కూడా రాయితీ వర్తింపజేస్తోంది. సాగు చేశాక ఐదేళ్ల తర్వాత ఏటా నికర ఆదాయం వస్తుంది.

– జ్యోతి, ఉద్యాన వన శాఖ అధికారి

సస్యరక్షణకు సూచనలిస్తున్నాం



ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన సస్యరక్షణకు సలహాలు, సూచనలిస్తున్నాం. ఇందులో అంతర పంటలూ సాగు చేసుకోవచ్చు. ఇందుకు మెలకువలను రైతులకు తెలియజేస్తాం. వాణిజ్య పంటలైన పప్పు దినుసులు, ఆయిల్‌పామ్‌తోనే రైతులకు అధిక ఆదాయం వస్తుంది.

– ప్రత్యూష, మండల వ్యవసాయాధికారి, జూలపల్లి

స్టేజీ–2 అంచనా వ్యయం ఖరారు

జ్యోతినగర్(రామగుండం): స్థానిక ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో నిర్మించనున్న తెలంగాణ స్టేజీ–2 ప్రాజెక్టు అంచనా వ్యయం ఎట్టకేలకు ఖరారైంది. మంగళవారం ఎన్టీపీసీ బోర్డు డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో అంచనా వ్యయం రూ.29,344.85 కోట్లుగా నిర్ధారించారు. స్టేజీ–2లో 800 మెగావాట్ల మూడు యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు.

'జమిలి ఎన్నికలు ఎలా సాధ్యం?'



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లిరూరల్: మనదేశంలోని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ఎన్నికల విధానం అమలవుతుండగా, జమిలి ఎన్నికల్నీ ఎలా నిర్వహిస్తారని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం గౌతంగోవర్ధన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడారు. అధ్యక్ష తరహా ఎన్నికల విధానాన్ని అమల్లోకి తెచ్చి రాష్ట్రాలను తమచెప్పు చేతల్లోకి తీసుకునేందుకు ప్రధాని మోదీ సర్కార్ కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రొఫెసర్ సాయిబాబాది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. కాగా, సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శత వార్షికోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వెంకటరెడ్డి కోరారు. నాయకులు శంకర్, తాండ్ర సదానందం, మోహన్, కనకరాజు, మల్లయ్య, సునీల్, ఓదెమ్మ, స్వామి, రమ, ఉదయ్, రాజమౌళి, రాజారత్నం, గట్టయ్య, మానస్‌కుమార్, సూర్య, ప్రీతం తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుల దుర్మరణం




అరుణ్, శివాజీ మృతదేహాలు

రామడుగు: మండలంలోని షా నగర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందినట్లు ఎస్సై శేఖర్ పేర్కొన్నారు . మండల కేంద్రానికి చెందిన సామంతుల శివాజీ (18) నీలం అరుణ్ (20) ద్విచక్రవాహనంపై వెదిర వైపు నుంచి రామడుగు గ్రామానికి వెళ్తున్నారు. షానగర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి



సాగర్ మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్త బస్టాండ్ సమీపంలో సాగర్ అనే వ్యక్తి మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి మృతిచెందాడు. బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన బందెల సాగర్ (35) పదేళ్లుగా కొత్తబస్టాండ్‌సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవిస్తున్నాడు. మంగళవారం ఉదయం అతిగా మద్యం సేవించి డ్రెయినేజీ పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ కుంబాల భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

చేప తగిలి యువకుడు..

గొల్లపల్లి: మండలంలోని చెందోళికి చెందిన నారవేణి తిరుపతి(38) చేపల వేటకు వెళ్లగా.. అక్కడ చేప తగిలి గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తిరుపతి తన మిత్రులతో కలిసి గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఓ చేప వచ్చి తిరుపతి ఛాతి భాగంలో బలంగా తగిలింది. అతడిని స్నేహితులు, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. తిరుపతి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



శ్యాం (ఫైల్)

శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లిలో మంగళవారం ఉరేసుకొని దాసారపు శ్యాం(25) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసారపు ఎల్లయ్య-తిరుపతమ్మ చిన్న కుమారుడు శ్యాం కారు కొనుక్కుని హైదరాబాద్‌లో కొన్నేళ్లుగా అద్దెకు నడుపుతున్నాడు. పదిరోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఇటీవల అప్పులు ఉన్నాయని కుటుంబసభ్యులు, బంధువులకు తెలిపాడు. తల్లిదండ్రులు పనికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్‌యాప్ వేధింపులతోనే శ్యాం ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై కేశవపట్నం ఎస్సై రవిని వివరాలు కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి



ధాన్యం పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రాంచంద్రం

జగిత్యాలరూరల్: రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి రాంచంద్రం అన్నారు. మంగళవారం రూరల్ మండలం పొలాసలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యంలో తేమ 17 శాతం వచ్చేలా ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఏడీఏ తిరుపతినాయక్, ఏఈవోలు శ్రీనివాస్, హరీశ్, ఆంజనేయులు, వరుణ్, రమ్య, రవళి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై గాంధీభవన్‌కు ఫోన్

జగిత్యాలరూరల్: రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లికి చెందిన గొంటి మొగిలి మంగళవారం గాంధీభవన్‌కు ఫోన్ చేశాడు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా ధాన్యం తూకం వేయడం లేదని, ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే రైతులకు జరిగే మేలు ఇదేనా..? అని ప్రశ్నించాడు.

పిల్లలేం చూస్తున్నారో?

- సెల్‌ఫోన్ మైకంలో విద్యార్థులు, యువత
- 'నెట్'లో పడితే అంతే సంగతులు
- తల్లిదండ్రులూ.. నిఘా తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే అవమానాలు, అంతులేని శోకమే
- ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో 71 సైబర్ క్రైం కేసులు

కరీంనగర్ క్రైం: కరోనా కారణంగా కాలు బయటపెట్టే వీల్లేకపోవడంతో పిల్లలు ఫోన్, కంప్యూటర్లలో ఆటలకు పరిమితమయ్యారు. అవి వారిలో హింసా ప్రవృత్తిని ప్రేరేపించాయి. క్రమంగా బెట్టింగ్‌కు అలవాటు పడేలా చేశాయి. ఇలా రూ.లక్షలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. పరువు పోతుందని బయటకు రాని సంఘటలు ఎన్నో. గతంలో బ్లూవేల్ ఆటకు అలవాటు పడ్డ పిల్లలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలూ ఉన్నాయి.



★ సోషల్ మీడియాతో చేటు



ఈ కాలపు యువత కాలక్షేపం అంతా సోషల్ మీడియాలోనే. నేరగాళ్లు వీటి మాటున చెలరేగుతున్నారు. ఫేస్‌బుక్ వేదికగా జరుగుతున్న మోసాలకూ అంతులేదు. అవతలి వ్యక్తి ఎవరో తెలియకుండా మొదలవుతున్న స్నేహం అనర్థాలకు దారితీస్తోంది. అమ్మాయిల ఫొటోలతో చాటింగ్ మొదలు పెడుతున్నవారు ఉచ్చు బిగించి, వేధింపులకు పాల్పడుతున్నారు.

★ మాల్‌వేర్ చొరబాటు..



అనేక అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. చదవాలనే ఆసక్తితో కొన్నింటిని తెరవగానే కంప్యూటర్లలోకి మాల్‌వేర్ చొరబడుతోంది. ఇది కంప్యూటర్ కార్యకలాపాలను నేరస్తులకు చేరవేయడమే కాదు.. బ్యాంకు ఖాతాల సమాచారాన్నీ చోరీ చేస్తుంది.

★ సైబర్ స్టాకింగ్..



ఆన్‌లైన్లో మారుపేరుతో స్నేహం చేస్తూ.. మహిళలను లైంగికంగా వేధించడమే సైబర్ స్టాకింగ్. ఈ తరహా నేరగాళ్లు మహిళల ఫోన్ నంబర్లు, ఈ–మెయిల్ ఐడీలు సేకరించి, ఇబ్బంది పెడతారు. విద్యార్థినులు, ఉద్యోగినులు దీని బారిన పడుతున్నారు.

★ సైబర్ టీజింగ్..



సూటిపోటి మాటలతో వేధించడం టీజింగ్. అదే ఆన్‌లైన్లో చేస్తే సైబర్ టీజింగ్. అనేక మంది ఇప్పుడు ఆన్‌లైన్లో దీన్నే ఫాలో అవుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలను రకరకాలుగా వేధిస్తున్నారు. తల్లిదండ్రులకు చెబితే ఏమనుకుంటారో అనే భయంతో వారు తమలో తామే కుమిలిపోతుంటారు.

★ క్యాట్ ఫిషింగ్..



మారుపేరుతో మోసానికి పాల్పడటం క్యాట్ ఫిషింగ్. ఈ తరహా నేరగాళ్లు మారు పేర్లు, ఫొటోలతో ఆన్‌లైన్ ప్రొఫైల్స్ పెట్టుకుంటారు. సామాజిక మాధ్యమాల ద్వారా కొంతకాలం స్నేహితులుగా నటిస్తారు. తర్వాత తమకు ప్రమాదం జరిగిందని, ఇంట్లో వాళ్లకు తీవ్ర అనారోగ్యం వచ్చిందని డబ్బు గుంజేందుకు ప్రయత్నిస్తుంటారు.

★ డాక్సింగ్..



ప్రముఖ వ్యక్తులు, సంస్థలను రకరకాలుగా వేధించడమే డాక్సింగ్. సంస్థలు, వ్యక్తుల కంప్యూటర్లలోకి చాటుగా చొరబడుతున్న నిందితులు కీలక సమాచారం తస్కరిస్తున్నారు. దాన్ని అంతర్జాలంలో పెడుతూ పరువు తీస్తున్నారు. అడిగినంత డబ్బు చెల్లించకపోతే ఇంకా ముఖ్యమైన సమాచారం బహిర్గతం చేస్తామని బెదిరిస్తారు.

★ సైబర్ బుల్లీయింగ్..



60 శాతం మంది యువత సైబర్ బుల్లీయింగ్ బారిన పడుతున్నారు. ఎదుటివారిని మానసికంగా దెబ్బతీసేలా పోస్టులు పెడుతూ ఇబ్బంది పెడతారు.

★ స్వాటింగ్..



ఫలానా వ్యక్తి సంఘ విద్రోహశక్తి. అతని దగ్గర మారణాయుధాలో, మాదకద్రవ్యాలో ఉన్నాయని పోలీసులకు సమాచారమిచ్చి, ఇబ్బందులకు గురిచేయడమే స్వాటింగ్. గిట్టనివారిని లక్ష్యంగా చేసుకునే నేరమిది.

★ వీడియో చాట్‌తో మోసం



రకరకాల పద్ధతుల్లో ఫోన్ నంబర్లు సేకరిస్తున్న నేరగాళ్లు అందమైన అమ్మాయిలతో మాట్లాడిస్తున్నారు. కొద్దిగా పరిచయం కాగానే వీడియో కాల్‌లో చాటింగ్ చేద్దామని ముగ్గులోకి దింపుతారు. అందుకు సిద్ధమవగానే రెచ్చగొట్టేందుకు వీడియో కెమెరా ముందే నగ్నంగా మారిపోతారు. మాటలతో మభ్యపెట్టి, ఎదుటివారినీ నగ్నంగా మారాలంటూ కవ్విస్తారు. లొంగిపోతే.. ఇక అయిపోయినట్లే. ఆ వ్యవహారమంతా రికార్డు చేస్తారు. సంబంధిత ఫొటోలు, వీడియోలు బయట పెడతామంటూ బెదిరించి, డబ్బు గుంజుతారు.

చెడు తొందరగా ఆకర్షిస్తుంది



సెల్‌ఫోన్ ఎక్కువగా వాడుతున్న యువత పక్కదారి పడుతోంది. ఫోన్‌లో ఉన్న మంచి కంటే చెడే ఎక్కువగా ఆకర్షిస్తుంది. పిల్లల్లో చదువు, ఇతర విషయాలపై ఏకాగ్రత సన్నగిల్లుతుంది. ఫలితంగా ఆత్మ విశ్వాసం కోల్పోతూ కోపం, మానసిక ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతాయి. పోర్న్ వీడియోలకు బానిసలై, సంఘ విద్రోహ శక్తులుగా తయారవుతున్నారు.

– డాక్టర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి, సైకాలజిస్టు

నేర ప్రవృత్తి పెరుగుతోంది



పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు, వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు ఇవ్వాల్సి వస్తోంది. అయితే, వారు ఏం చూస్తున్నారని తల్లిదండ్రులు గమనిస్తుండాలి. పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి, తల్లిదండ్రుల అకౌంట్లలోని డబ్బులు పోగొడుతున్నారు. అశ్లీల చిత్రాలు, ఇతర వీడియోలతో నేర ప్రవృత్తి పెరిగి, పలు నేరాలు చేస్తున్నారు. కేసుల పాలవుతూ జైలుకు సైతం వెళ్తున్నారు.

– జి.నరేందర్, ఏసీపీ, కరీంనగర్ టౌన్

సెల్‌ఫోన్లే కారణం



పిల్లలు, యువత చెడుమార్గంలో పయనించడానికి ముఖ్య కారణం సెల్‌ఫోన్‌లే. ఆన్‌లైన్ క్లాసుల నెపంతో వివిధ లింకులు, వీడియోలు చూస్తూ మొబైల్‌కు బానిసలవుతున్నారు. చదువుపై ధ్యాస పెట్టకుండా, జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కొందరు వీడియోలు చూస్తూ మద్యం, డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఫోన్ అవసరం తీరాక తల్లిదండ్రులు వెంటనే తీసుకోవాలి.

– ఎ.కిరణ్‌కుమార్, న్యాయవాది

అవగాహన కల్పించాలి



ఫోన్లను చదువు కోసం కాకుండా చెడిపోవడానికే ఎక్కువగా వాడుతున్నారు. తల్లిదండ్రులు పట్టించుకుంటే దీన్ని చాలావరకు నియంత్రించవచ్చు. స్కూళ్లు, కాలేజీల్లో సెల్‌ఫోన్లతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆన్‌లైన్ గేమ్స్ ఆడి, డబ్బులు పోగొట్టుకోవడం, వివిధ నేరాలకు పాల్పడటం, చదువుకున్న యువత జల్సాల కోసం చోరీలు చేస్తుండటం బాధ కలిగిస్తోంది.

– శనిగరపు రవి, ప్రభుత్వ టీచర్

'శ్రీచైతన్య'లో కాన్షియస్‌నెస్ క్లబ్



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ బాబా

తిమ్మాపూర్(మానకొండూర్): కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో మంగళవారం కాన్షియస్‌నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించామని ఎక్సైజ్ సీఐ కె.బాబా తెలిపారు. క్లబ్‌లో స్కూల్ ప్రిన్సిపాల్, ఇద్దరు ఉపాధ్యాయులతోపాటు ఇద్దరు విద్యార్థులు సభ్యులుగా ఉంటారని వివరించారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డ్రగ్ ఫ్రీ ఇండియా నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ.. చైల్డ్ రైట్స్, గుడ్ టచ్, బ్యాడ్ టాచ్, మొబైల్ అతివినియోగం అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.రవీందర్‌రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది శేషగిరి రాజు, కొండల్‌రెడ్డి, మనోహర్, ధనలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ సిబ్బంది రమేశ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విషాదం మిగిల్చిన రోడ్డు ప్రమాదం

- కారు ఢీకొని వ్యక్తి మృతి
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు



స్వామి (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లి బస్టాండ్ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామానికి చెందిన పెసరు స్వామి(46) దుర్మరణం చెందడం ఆ కుటుంబంలో తీవ్రవిషాదం నింపింది. ఇదే ఘటనలో మరో వ్యక్తి మిట్ట ఆశాలు తీవ్రంగా గాయపడ్డాడు. బంజేరుపల్లి నుంచి కటికెనపల్లికి స్వామి, ఆశాలు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా ఢీకొనడంతో పెసరు స్వామి అక్కడికక్కడే మరణించాడు. మిట్ట ఆశాలు కాలు విరిగింది. సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఆశాలును కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. స్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించారు.

ఆ కుటుంబానికి అన్నీ కష్టాలే..

పేద కుటుంబానికి చెందిన పెసరు స్వామి– స్వప్న దంపతులు. వీరికి కూతుళ్లు సింధూ, శివాణి ఉన్నారు. చిన్నకూతురు శివాణి ఇంజినీరింగ్ కోర్సు చదువుతోంది. పెద్దకూతురు సింధూకు నాలుగేళ్ల క్రితం వేములవాడ మండలం నూకలమర్రికి చెందిన సమీప బంధువు, వరుసకు మేనల్లుడు, ముంబాయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కునాల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత వీరి కాపురంలో కలతలు రావడంతో మనస్థాపానికి గురైన సింధూ ముంబాయిలోని తమ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడిని స్వామి దంపతులు తీసుకొచ్చి సంరక్షించుకుంటున్నారు. స్వామి ఫొటోగ్రాఫర్‌గా పనిచేసినా ఆశించిన ఆదాయం రాక కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో భార్య స్వప్నతో కలిసి గ్రామంలోనే టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నారు. రెండేళ్లక్రితం పెద్ద కూతురు చనిపోవడం, ప్రస్తుతం భర్త స్వామి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో స్వప్నతోపాటు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తండ్రి మరణవార్త విన్న శివాణి స్పృహతప్పి పడియింది. గ్రామస్తులు వెంటనే వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బుగ్గారం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన గుజ్జేటి వంశీ, ధర్మపురికి చెందిన తుమ్మ ఉపేందర్ మంగళవారం గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. స్పందించిన ఎస్సై తమ సిబ్బందితో వెల్గొండ క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఇందులో అక్రమంగా తరలిస్తున్న 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏడుగురికి గంజాయి పరీక్షలు

చందుర్తి (వేములవాడ): చందుర్తి సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో అనుమానిత యువకులకు మంగళవారం గంజాయి పరీక్షలు నిర్వహించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంజాయి సేవిస్తున్నారన్న అనుమానంతో వారికి పోలీసుస్టేషన్ ఆవరణలో పరీక్షలు నిర్వహించారు. నెగెటివ్ రావడంతో వారిని వదిలేసినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరికి జైలు, జరిమానా

సిరిసిల్ల కల్చరల్: దొంగతనాలకు సంబంధించిన రెండు వేర్వేరు కేసుల్లో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్పీఅఖిల్ మహాజన్ తెలి పిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జయనగర్‌కు చెందిన పుదరి రాజు 2017 నవంబర్ 11న అంబికా నగర్‌లోని ఓ ఇంటి తాళం పగలగొట్టి రూ.97 వేల సామగ్రిని దొంగిలించాడు. ఇంటి యజమాని ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏడుగురి సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించింది. పట్టణంలోని శివనగర్‌కు చెందిన బలవేణి సుమన్ అలియాస్ అర్జున్ గంజాయికి అలవా టుపడ్డాడు. అవసరమైన వారికి అమ్మడానికి రవా ణా చేస్తుండగా పోలీసులు సాయినగర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. అప్పటి సీఐ ఉపేందర్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చె లుమల సందీప్ కేసు వాదించగా, తొమ్మిది మంది సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సుమన్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

కొడుకు పోషించడం లేదని.. వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: కొడుకు పోషించడం లేదని జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన చట్లపల్లి గంగారాం (70) తీవ్ర మనస్తాపంతో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై మన్మధరావు కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన గంగారాం పేరున ఆస్తులున్నాయి. ఉన్న ఇంట్లోనే కొడుకు వేరుకాపురం పెట్టాడు. గంగారాం తన భార్య భాగ్యమ్మతో కలిసి నివసిస్తున్నాడు. గంగారాంను కొడుకు కొద్దిరోజులుగా పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడిపై పీడీయాక్ట్

- రామగుండం సీపీ శ్రీనివాస్ వెల్లడి



పీడీయాక్ట్ పత్రం అందిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

గోదావరిఖని: మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్‌పై పీడీయాక్టు అమలు చేసినట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న కుంట శ్రీనివాస్‌కు మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు మంగళవారం పీడీయాక్టు పత్రాన్ని అందజేసి చర్లపల్లి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఇతడిపై ఇప్పటికే నాలుగు కేసులు నమోదు చేసి జైలులో ఉన్నాడని తెలిపారు. గతంలో రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో అడ్వకేట్ వామన్‌రావు హత్య కేసులో జైలుకు వెళ్లిన అతడి నేరప్రవృత్తి తీరులో మార్పు రాకపోవడంతో పీడీయాక్ట్ నమోదు చేసినట్లు వెల్లడించారు. గ్రూప్‌లుగా ఏర్పడి గొడవలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేశామని, త్వరలో వారిపై కూడా పీడీయాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. హత్యాయత్నాలు, హత్యలకు పాల్పడిన, అక్రమ ఫైనాన్స్, గంజాయి రవాణా, పేకాట, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, భూకబ్జాలకు పాల్పడడం, వైట్‌కాలర్ నేరస్తులపై పీడీ యాక్ట్ అమలు చేయనున్నట్లు సీపీ హెచ్చరించారు.

మొబైల్ షాపులో చోరీ



దొంగతనం జరిగిన మొబైల్ పాయింట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గాయత్రి మొబైల్స్ షాపులో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు వెంటిలేటర్ నుంచి చొరబడి సుమారు రూ.2 లక్షల విలువైన ఫోన్లను దొంగిలించారు. షాపుయజమాని సోమవారం సాయంత్రం షాపునకు తాళాలు వేసుకుని వెళ్లాడు. గుర్తుతెలియని దొంగలు షాపు వెనకాల ఉన్న వెంటిలేటర్ నుంచి చొరబడ్డారు. మొబైల్‌ఫోన్స్‌తోపాటు రూ.15 వేలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం షాపు యజమాని వచ్చి చూసేసరికి సామగ్రి చిందరవందరగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని క్లూస్‌టీం ఆధారంగా ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం.. నిందితుల అరెస్టు

సిరిసిల్ల క్రైం: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. కలెక్టరేట్లో డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని పలువురు దగ్గర డబ్బులు తీసుకున్న నిందితులను అరెస్టు చేసినట్లు వివరించారు. సీఐ వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన కాకర్ల భాను ప్రకాశ్ టెస్టా టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని సిరిసిల్లకు చెందిన రాపెల్లి విద్యాసాగర్ వద్ద రూ.2లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా.. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. బాధితుడి ఫిర్యాదుతో కాకర్ల భాను ప్రకాశ్‌ను అరెస్టు చేశారు. సిరిసిల్ల కలెక్టర్‌లో డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ జాబ్ ఇప్పిస్తానని మోసం చేసిన కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన కొండికొప్పుల శంకర్, వేల్పుల నగేశ్, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. సిరిసిల్లలోని బీవై.నగర్‌కు చెందిన సాగల జీవన్‌కు సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని నిందితులు రూ.2లక్షలు, దానవేని సుప్రియ వద్ద రూ.1.70లక్షలు తీసుకుని మోసం చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు కొండికొప్పుల శంకర్‌ను అరెస్టు చేశారు. మిగితావారు పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు.



జైశ్రీరామ్.. జై హనుమాన్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అంజన్నతోపాటు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం చలి అధికంగా ఉండడంతో మధ్యాహ్న సమయంలో రద్దీ పెరిగింది. భక్తుల ఏర్పాట్లను లయ ఏఈవో అంజయ్య, అధికారులు ఉమామహేశ్వరరావు, హరిహరనాథ్, రాజేందర్ రెడ్డి, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.






భక్తి గీతాలు.. కార్తీక దీపాలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఏఈవో శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. శ్రీ మండప హనుమాన్ భజన మండలి వారి భజన కార్యక్రమం ఆకట్టుకుంది. ఆనంతరం ఆలయం ఆవరణలో వివిధ ఆకృతులతో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.